

దివ్యాంగుడైనా.. వలంటీర్‌గా పని చేస్తూ



మహిళకు ఫించన్ అందజేస్తున్న ఈ యువకుడి పేరు సుదర్శన్. చిన్నతనంలోనే ఇతనికి పోలియో సోకడంతో దివ్యాంగుడయ్యాడు. డిగ్రీ పూర్తి చేసిన ఈ యువకుడికి ప్రభుత్వం వలంటీర్‌గా అవకాశం కల్పించడంతో గ్రామంలోని 8వ వార్డులో సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తూ అర్హులైన వారు వాటిని దరఖాస్తు చేసుకుని పొందేలా చూస్తున్నాడు. ప్రతి నెలా 1వ తేదీ ఉదయమే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఫించన్లు అందజేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వలంటీర్ వ్యవస్థ ద్వారా తమ ఇంటి వద్దకే సేవలు అందుతున్నాయని కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– పెద్దముడియం

కన్నకొడుకులా సేవలందిస్తున్నాడు



అయ్యా నాకు ముగ్గురు కూతుర్లు ఉంటే పెళ్లి చేశాను. నా భర్త చనిపోయాడు. బతకనీకి ఎటువంటి ఆధారం లేదు. దేవుడిలా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రతి నెలా మొదటి రోజునే ఫించన్ ఇంటి వద్దకే తీసుకువచ్చి సుదర్శన్ ఇస్తాడు. కన్న కొడుకులా సుదర్శన్ సేవలందిస్తున్నాడు.

– లక్ష్మి కాంతమ్మ, పెద్దపసుపుల, పెద్దముడియం

సేవ చేస్తుంటే ఆనందంగా ఉందంటున్నాడు



ఇతను చక్రాయపేటకు చెందిన వలంటీర్ యోగాంజలు. ఇతని సేవలను స్థానికులు ఎంతగానో మెచ్చుకుంటారు. ముసలోల్లకు సేవ చేస్తుంటే ఆనందంగా ఉందంటున్నాడు. ఇతని పరిధిలోని వృద్ధురాలైన పెద్దలక్షుమ్మ ఇతని సేవలను ఎంతగానో మెచ్చుకుంటోంది. అమె వికలాంగురాలు గతంలో పింఛన్ తెచ్చుకోవాలంటే చాలా ఇబ్బంధి పడేది. జగనన్న ప్రభుత్వంలో వచ్చిన వలంటీర్ల పుణ్యమా అని మాలాంటివారు ఎంతో ఆనందంగా ఉన్నారంటోంది. ఇంటివద్దకే పింఛన్ రావడంతో గత కష్టాలనుంచి బయటపడ్డామంటోంది.

– చక్రాయపేట.

వికలాంగురాలైన వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న వలంటీరు యోగాంజలు

వలంటీర్ పుణ్యమా అని ఇంటికే పింఛన్ వస్తోంది..



నాపేరు పెద్దలక్షుమ్మ మాది చక్రాయపేట. నేను వికలాంగురాలిని గతంలో పింఛన్ తెచ్చుకోవాలంటే చాలా ఇబ్బందిపడేదాన్ని. ఎవరన్నా వచ్చి సాయం చేస్తారా అని ఎదురు చూసేదాన్ని. మా వలంటీర్ యోగాంజలు వచ్చినప్పటి నుంచి నాకు ముందు కష్టాలు తప్పాయి. యోగాంజలు తెల్లవారక ముందే ఇంటివద్దకు వచ్చి పింఛన్ అందజేస్తున్నాడు.

– పెద్ద లక్షుమ్మ, వృద్ధురాలు, చక్రాయపేట

ఆపదలో అండగా ఉండేది



కరోనా సోకి ఇబ్బందులు పడుతున్న బాధితులకు వేములకు చెందిన వలంటీర్ గౌరి అండగా నిలిచింది. ఇంటి వద్ద ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ కరోనా సోకిన వ్యక్తికి సలహాలు, సూచనలు ఇచ్చేది. సమయానికి మందులు ఇచ్చి ఆరోగ్య పరిస్థితిపై తెలుసుకునే వారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లయితే 108కు సమాచారం అందించి మెరుగైన చికిత్స కోసం క్వారంటైన్‌కు తరలించారు. అలాంటి సమయంలో కుటుంబ సభ్యులు లేకున్నా వలంటీర్లే అన్ని తామై సేవలు అందించేది గౌరి.

– వేముల

కరోనా సమయంలో శివమ్మకు ధైర్యం చెబుతున్న వలంటీర్ గౌరి (ఫైల్‌ఫొటో)

కరోనా సమయంలో ఆదుకుంది



నా పేరు శివమ్మ, మాది వేముల. కరోనా సమయంలో చాలా ఇబ్బందులు పడ్డాం. కుటుంబ సభ్యులు కూడా దగ్గరకురాని సందర్భంలో వలంటీర్ గౌరి ఆశా వర్కర్‌తో కలిసి ఇంటి వద్దకు వచ్చారు. కరోనా సోకి ఇంట్లోనే ఒంటరిగా చికిత్స తీసుకుంటుండగా.. ఎప్పటికప్పుడు మందులు, పోష్టికాహారం తీసుకుని వచ్చి అందించేది. అంతేకాక ప్రతి రోజు ఆరోగ్యంపై ఆరా తీస్తూ ధైర్యం చెబుతుండేది.

– శివమ్మ(స్థానికురాలు), వేముల

ఏ సమస్య వచ్చినా అండగా..



తొండూరులో హసీనా వలంటీర్‌గా పని చేస్తుంది. తనకు సంబంధించి 50 ఇళ్లలో ఏ ఒక్కరికి ఏ సమస్య వచ్చినా దగ్గరుండి చూసుకుంటుండేది. మస్తానమ్మకు ఇంట్లో పిల్లలెవరూ లేక పోయినా ప్రతినెలా 1వ తేదీన ఇంటికి వెళ్లి పింఛన్ డబ్బులు అందిస్తూ ఏదైనా సమస్యఉంటే సాయపడేది. కరోనా సమయంలో ఇంటి నుంచి మస్తానమ్మ బయటకు రాకున్నా ఆమె కావాల్సిన సరుకులన్ని తెచ్చిఇచ్చేది.

– తొండూరు

ప్రభుత్వ పథకాలకు సంబంధించిన రసీదును

నా బిడ్డలా చూసుకుంది..



నా పేరు మస్తానమ్మ, నేను తొండూరు శివాలయం వద్ద నివసిస్తున్నాను. మా వలంటీర్ హసీనా నాకు ఏదైనా అవసరమైతే వెంటనే వచ్చి దగ్గరుండి నా బిడ్డలా చూసుకుంటోంది. కరోనా సమయంలో నేను బయటకు వెళ్లకపోతే వలంటీరే వచ్చి మందులు, సరుకులు అందించింది. నాకు ఎటువంటి సమస్య వచ్చినా వలంటీర్‌గా అండగా ఉంటోంది.

– మస్తానమ్మ(స్థానికురాలు), తొండూరు

గ్రామ స్వరాజ్యం ఏర్పాటే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ఏర్పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఎన్.పాలగిరిలో రూ.96లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, పాలసేకరణ కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను గ్రామస్థాయిలోనే అందించాలన్న సంకల్పంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారన్నారు. ఇటువంటి కార్యక్రమాలు గతంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, రాష్ట్ర అర్టికల్చర్, అగ్రికల్చర్ సలహాదారులు సంబటూరు ప్రసాదురెడ్డి, తిరుపాల్‌రెడ్డి, ఏపీపీఎస్సీ బోర్డు మెంబర్ నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, ద్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి, కడప ఆర్టీఓ ధర్మచంద్రారెడ్డి, వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, స్థానిక నాయకులు శ్రీనివాసుల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, చెన్నకేశవరెడ్డి, నాగమునిరెడ్డి, చెండ్రాయుడు, మహేశ్వర్‌రెడ్డి, గురివిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిశోధన కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మండలంలోని ఎన్.పాలగిరి గ్రామంలో ప్రతిభ బయోటెక్ అధినేత ఇసుకపల్లె రాజశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఆర్‌ఎం వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డిలు తెలిపారు. ఆదివారం పరిశోధనా కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. మండలంలోని ఒక పల్లెటూరులో అది కరువు ప్రాంతంలో అధునతన పరికరాలతో పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సాహసోపేతమైన నిర్ణయమని రాజశేఖర్‌రెడ్డిని వారు అభినందించారు. వ్యవసాయ రంగంలో కొత్త విదానాల గురించి రైతులకు తెలియజేయడంతో పాటు వారికి తరచూ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని చూసించారు. శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొని వారు అందించే సలహాలు సూచనలు పాటించాలని ఆయన రైతులను కోరారు. వ్యవసాయానికి అవసరమైన వాటిని గ్రామ స్థాయిలోనే అందించడంతో పాటు దానికి సంబంధించిన సలహాలు సూచనలు అందించాలన్న సంకల్పంతో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సంస్థ ఎండీ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిభ భయోటెక్ సంస్థను 60 మంది సిబ్బందితో స్థాపించడం జరిగిందని ప్రస్తుతం 7 వందల మందితో ముందుకు సాగుతోందన్నారు. రైతుల పొలాలకు సంబంధించి మట్టి, నీరు పరిశీలించడంతో పాటు ఆయా భూములకు సరిపడే విధంగా సలహాలు అందిస్తామన్నారు. ప్రతి శనివారం 100 మంది రైతులకు శిక్షణ తరగతులతో పాటు వారికి భోజన సౌకర్యం ఉంటుందన్నారు. రైతును వ్యాపారస్తుడిని చేయాలన్నదే ఆర్‌ఎం కిసాన్ ధ్యేయమని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విలేజ్ క్లినిక్‌లతో విప్లవాత్మక మార్పులు

పెండ్లిమర్రి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకవస్తున్నాడని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గంగనపల్లె గ్రామ సచివాలయం పరిధిలో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో జర్వంతో పాటు ఇతర చిన్న అనారోగ్య సమస్యలు వచ్చిన సకాలంలో విలేజ్ క్లినిక్‌లల్లో వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతోనే సీఎం జగన్ విటిని ఏర్పాటు చేశారన్నారు. విలేజ్ క్లినిక్‌లల్లో ఏఎన్‌ఎంలు, వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని రకాల జబ్బులకు వ్యాక్సిన్లు వేస్తారన్నారు. అలాగే వడ్డవాండ్లపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హైదర్‌బాషా వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, మాజీ మండల ఉపాధ్యాక్షుడు నాగమల్లారెడ్డి, పొలతల చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ సురేఖ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏ సమస్య ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలి

డీఎస్పీ వినోద్‌కుమార్



మోట్నూతలపల్లెలో నాకా బందీలో డీఎస్పీ వినోద్‌కుమార్, తదితరులు

పులివెందుల : గ్రామంలో ఏ చిన్న సమస్య ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకొస్తే సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. ఆదివారం మండలంలోని మోట్నూతలపల్లెలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పోలీసు సిబ్బందితో కలిసి ఆయన నాకా బందీ నిర్వహించి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేర చరిత్ర కలిగి ఉండటంవలన సమాజంలో విలువలు కోల్పోతారని.. ఈ ప్రభావం మీ కుటుంబంలోని వ్యక్తులపై పడుతుందని గుర్తు చేశారు. అనంతరం చెడు నడత కలిగిన, కేసులలో పాత నేరస్తులుగా ఉన్న వ్యక్తుల ఇళ్లను, వారికి చెందిన అనుమానిత స్థావరాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వారందరిని సమావేశపరిచి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురం : మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామమైన బిదినంచర్లలో ఆదివారం ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు అనుమాన ప్రదేశాలలో, కలాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ హాజిబాషా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వల్లూరు : మండలంలోని అంబవరం గ్రామంలో ఆదివారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్ఐ పెద్దఓబన్న ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గ్రామంలో తనిఖీలను నిర్వహించారు. అనంతరం స్థానికులతో సమావేశాన్ని నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలకు గానీ, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు గానీ పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

కళాశాల అభివృద్ధికి కృషి చేస్తాం



కళాశాల అభివృద్ధిపై చర్చిస్తున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, తదితరులు

వేంపల్లె : స్థానిక గ్రామ పంచాయతీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక అయిన వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల సర్వతోముఖాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని కళాశాల ప్రణాళిక అండ్ అభివృద్ధి మండలి ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆదివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యోగాంజనేయులు ఆధ్వర్యంలో మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, షబ్బీర్‌వలి, విద్యావేత్త రాజు, బాలం గోపల్ తదితరులు పాల్గొని అనేక సూచనలు, సలహాలను ఇచ్చారు. ఈ సమావేశంలో కళాశాల అభివృద్ధికి సంబంధించి అనేక విషయాలపై దాదాపు 2గంటలపాటు చర్చించి పలు తీర్మాణాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. చరిత్ర శాఖ తలపెట్టిన జాతీయ సదస్సును అతి త్వరలో నిర్వహించాలని, కళాశాల విద్యార్థులకు యూనిఫాం దుస్తులు, మెరిట్ విద్యార్థులకు పారితోషకాలు, బహుమతులు ఇవ్వాలని ఏకగీవ్రంగా తీర్మానించారు. జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పారితోషక సహాయాన్ని అందించేందుకు అంగీకరించారు. సర్పంచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ కళాశాల పరిశుభ్రతకు వీధి దీపాలకు తక్షణమే చర్యలు చేపడతామన్నారు. విద్యావేత్త బాలం గోపాల్ మాట్లాడుతూ నూతనంగా నిర్మించే కళాశాల ఆవరణలో స్వామి వివేకానంద, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను ప్రతిష్టించాలని ప్రతిపాదించగా.. మండలి ఏకగ్రీవంగా అంగీకరించింది. షేక్ షబ్బీర్‌వల్లి చర్చలో పాల్గొని జాతీయ సదస్సు నిర్వహణకు సెమినార్ హాలు, వసతి ఏర్పాట్లకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యావేత్త రాజు చర్చలో పాల్గొంటూ ఎండోమెంట్ ప్రైజెస్‌ను కూడా ప్రవేశపెట్టినట్లయితే కళాశాల అభివృద్ధికి బాగా దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. మండలి కార్యక్రమాలను పర్యవేక్షించిన పీఆర్‌ఓ డాక్టర్ బాలనారాయణ మాట్లాడుతూ మీ అందరి సహకారంతో మనందరం సమష్టిగా కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, అధ్యాపక సంఘ కార్యదర్శి బాలకొండ గంగాధర, అధ్యాపకేతర సంఘ కార్యదర్శి మహేష్ రావు, కళాశాల పీడీ తేజేంద్ర, ప్రసాద్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. పోతురాజు వద్ద ముద్దలను ఏరాటు చేసి జంతుబలులు నిర్వహించారు. ఆలయ సమీపంలోని ఆలయాలలోభక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేముల : మండల పరిధిలోని పెర్నపాడు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆయా గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ జేఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కె.వి పెర్నపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు జగనన్న సురక్ష కార్యక్రమం

ఎర్రగుంట్ల : పట్టణంలోని న్యూకాలనీ–1 8వ వార్డు సచివాలయం సమీపంలోని పార్టీ కార్యాలయం వద్ద సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పాల్గొంటారని మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. సచివాలయ పరిధిలోని ప్రజలు పాల్గొని సమస్యలు తెలుపుకోవచ్చన్నారు.

జూదరుల అరెస్ట్

వల్లూరు : మండలంలోని అంబవరం గ్రామ సమీపంలోని పొలాల్లో జూదం ఆడుతున్న నలుగురిని ఆదివారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ 8,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పెద్దఓబన్న తెలిపారు.

ప్రజాదర్బార్‌లో సమస్య పరిష్కారం



ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవించు కుంటున్న ప్రజలు

ఎర్రగుంట్ల : నిడుజివ్వి, ఎర్రగుంట్ల పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పాల్గొని ప్రజల నుంచి వచ్చిన సమ్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కోటవీధిలో జగనన్న సురక్ష

జమ్మలమడుగు : పట్టణంలోని 15,16వ వార్డులకు సంబంధించి కోటవీధిలోని సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం పది గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, ఆ వార్డులకు సంబంధించిన కౌన్సిలర్లు హాజరవుతారన్నారు. ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సీమ సాహిత్యంలో అలుగోగు కథలు చిరస్మరణీయం



దర్పణం శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న గడియారం సాహితీపీఠం సభ్యులు

జమ్మలమడుగు రూరల్ : రాయలసీమ కథా సాహిత్యరంగంలో దర్పణం శ్రీనివాస్ రచించిన అలుగోగు కథలు చిరస్థాయిగా, చిరస్మరణీయంగా నిలబడతాయని ప్రముఖ కథా రచయిత కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ వేంపల్లె షరీఫ్ తెలిపారు. ఆదివారం జమ్మలమడుగు పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలో గడియారం సాహితీపీఠం అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో దర్పణం శ్రీనివాస్ రచించిన అలుగోగు కథలు పుస్తకావిష్కరణ నిర్వహించారు. అనంతరం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత చదువుల బాబు ప్రసంగించారు. గడియారం సాహితీ పీఠం కార్యదర్శి గణపతి, పెన్నర్ల సంఘం గౌరవధ్యక్షుడు పొన్నారి దస్తగిరి, గురుకుమార్ విద్యాశాఖధికారులు పరమేశ్వరయ్య, చౌడయ్యలు దర్పణం శ్రీనివాస్‌ను గడియారం సాహితీ పీఠం వారు ఘనంగా సన్మానించారు.

చర్చి పునర్నిర్మాణంలో గ్రామస్తుల కృషి



మండల వైస్ ప్రెసిడెంట్‌ను సత్కరిస్తున్న బిషప్ డాక్టర్ గాలి బాలి

కమలాపురం : గ్రామంలోని చర్చి పునర్నిర్మాణంలో గ్రామస్తుల కృషి ఎంతో ఉందని ఆర్‌సీఎం బిషప్ డాక్టర్ గాలి బాలి తెలిపారు. మండల పరిధిలోని ఎర్రగుడిపాడు గ్రామంలో రూ.7.5 లక్షల వ్యయంతో పునర్నిర్మించిన ఆర్‌సీఎం చర్చిని ఆయన మండల వైస్ ప్రెసిడెంట్ శిరిగిరెడ్డి చెన్నకేశవరెడ్డితో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. బిషప్, మండల వైస్ ప్రెసిడెంట్‌ను సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. చర్చి ఫాస్టర్ మరియన్న, సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

నగరవనం.. ఆనంద నిలయం



నగరవనం ముఖద్వారం వద్ద పర్యాటకులు

పులివెందుల టౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల ప్రారంభించిన నగరవనం (రాణితోపు), గరండాల్ రివర్ ప్రాంతాలను సందర్శించేందుకు ఆదివారం సందర్శకులతో నిండుగా కిటకిటలాడింది. సందర్శకుల తాకిడి అధికమవ్వడంతో సిబ్బంది అదుపు చేయలేని పరిస్థితి ఏర్పడింది. వాహనాల పార్కింగ్‌తో ముఖద్వారం నిండుగా కనిపించింది. ఎటూ చూసిన జనంతో నగర వనం నిండిపోయింది. శ్రీరాజా కళానిలయం డ్యాన్స్ అకాడమి చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఎక్కడ చూసినా జనమే జనం కనిపించారు. గరండాల్ రివర్‌లో ఏర్పాటు జారుడు బల్లలు, ఊయలలు, ఓపెన్ జిమ్, ఆట వస్తువుల వద్ద చిన్నారులు ఎంతో ఆనందంగా గడిపారు. మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న సందర్శకులు



జానపద నృత్యంలో చిన్నారులు



నగరవనంలో ఆడుకుంటున్న చిన్నపిల్లలు, పెద్దలు